క్లుప్తంగా

'జనజాగరణ' విజయవంతం చేయండి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

బోట్‌క్లబ్: గోదావరి విభాగ్ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జన జాగరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ నగర అధ్యక్షుడు టీఎస్వీ ఆదిత్యశర్మ వెల్లడించారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్వయంసేవ సంఘం గత 98 ఏళ్లుగా దేశవ్యాప్తంగా పనిచేస్తున్నారు. ప్రజాహిత కార్యక్రమాలను ఈ నెల 27న ప్రారంభించి వచ్చే సెప్టెంబర్ మూడో తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. ఏడాది ఛత్రపతి శివాజీ 350వ జయంతి, అల్లూరి సీతారామరాజు 125వ జయంతి, ఆర్ఎస్ఎస్ వందేళ్ల వార్షికోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం శివాజీ స్ఫూర్తి, అల్లూరి శక్తి, ఆర్ఎస్ఎస్ దీప్తి కరపత్రాలను ఆవిష్కరించారు. జన జాగరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదిత్య శర్మ కోరారు. ఆర్ఎస్ఎస్ నాయకులు పతివాడ రామరాజు, నండూరి కృష్ణ, మామిడాల శ్రీనివాస్, వాసంశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర పరిశ్రమ నుంచి ప్రకాష్‌రాజ్‌ను బహిష్కరించాలి



బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్

బోట్‌క్లబ్: చంద్రయాన్- 3 ప్రయోగం సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలపై అనుచిత వ్యాఖ్యలు, వ్యంగ్య చిత్రాలను తన ట్విట్టర్ ఖాతాలో పెట్టిన సినీనటుడు ప్రకాష్‌రాజ్‌ను తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి బహిష్కరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సాంబమూర్తినగర్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి ప్రకాష్‌రాజ్‌ను నిషేధించాలని మూవీ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణుకు, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడు దామోదర ప్రసాద్‌కు లేఖలు రాశామన్నారు. దేశం యావత్తు చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావాలని పూజలు, ప్రార్థనలు చేస్తున్న వేళ ప్రకాష్‌రాజ్ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ట్విట్టర్‌లో పెట్టిన వ్యాఖ్యలు, వ్యంగ్య చిత్రాలు దేశ ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేశాయన్నారు. గతంలో ప్రధాని మోదీపై సైతం ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. సమావేశంలో నాయకులు మాలకొండయ్య, దువ్వూరి సుబ్రహ్మణ్యం, పానుగంటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల కూల్చివేతపై విచారణ జరిపించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: గంగనాపల్లిలో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లు కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం వరకు చేరుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మోర్త రాజశేఖర్, రూరల్ కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ గంగనాపల్లిలో గ్రామ కంఠం భూమిని 1983లో పేదలకు పంచారన్నారు. 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న 36 కుటుంబాలను తప్పుడు కాగితాలు పుట్టించి రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కూల్చివేశారన్నారు. అనంతరం ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణను కలసి వినతి పత్రం అందజేశారు. నాయకులు చింతపల్లి అజయ్ కుమార్, చెక్కా రమని, టి.రాజా, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణా తరగతులు

కాకినాడ కల్చరల్: శ్రీసత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ధ్యాన, ఆరోగ్య, యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు మండలి కన్వీనర్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. 26న విద్యుత్‌నగర్‌లోని శాంతి ఆశ్రమం సమావేశ మందిరంలో, 27న సూర్యారావుపేటలోని శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ప్రముఖ యోగా గురువులు శ్రీను గురూజీ, ఆదికనకలక్ష్మీ మాతాజీలు శిక్షణ ఇస్తారన్నారు.

ధర్నాలపై నిషేధాన్ని ఎత్తివేయాలి

కాకినాడ సిటీ: రాజ్యాంగబద్ధమైన నిరసనలు, ర్యాలీలను నిషేధిస్తూ ఇచ్చిన జీవో నంబర్ ఒకటిని రాష్ట్ర హైకోర్టు కొట్టి వేసిన తర్వాత కూడా కాకినాడ కలెక్టరేట్ ముందు అనధికార నిషేధాన్ని కొనసాగిస్తున్నారని అఖిల పక్షం నాయకులు అన్నారు. ఈ మేరకు శనివారం డీఆర్వో కూరపాటి శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తొలుత కచేరిపేట సీఐటీయూ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులు సమావేశమయ్యారు. నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, బోడకొండ, మోర్త రాజశేఖర్, దువ్వా శేషుబాబ్జీ పాల్గొన్నారు.

ఫ్రూట్‌ఫుల్ లైఫ్

- పాఠశాలల్లో సంపూర్ణ పోషణ యోజన
- పండ్ల మొక్కల ద్వారా పౌష్టికాహారం
- విద్యార్థులకే వాటి ఫలసాయం



సంపూర్ణ పోషణ యోజన కింద మొక్క నాటిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి (ఫైల్)

కాకినాడ: ఈ సంకల్పం.. 'ఫల'ప్రదమే. చదువరులకు ప్రయోజనమే.. విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి ఉపయోగకరమే. సర్కారు బడుల్లో చదివే పిల్లలకు మెరుగైన విద్యతో పాటు సంపూర్ణ పోషకాహారాన్ని అందించాలని సంకల్పించారు. దీనికోసం సంపూర్ణ పోషణ యోజన పేరిట వినూత్న కార్యక్రమానికి కాకినాడ నగరపాలక సంస్థలో శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో 15 రకాల పండ్ల మొక్కలను పెంచి వాటి ద్వారా వచ్చే ఫలసాయాన్ని అక్కడి విద్యార్థులు స్వీకరించడం ద్వారా వారిలో పౌష్టికాహార లోపాన్ని నివారించాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. నగరంలో ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు 90 వరకూ ఉండగా, ఇందులో సుమారు 23 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నప్పటికీ చాలా మంది పౌష్టికాహార లోపంతో తరచూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల ఆవరణలోనే పండ్ల మొక్కలను పెంచడం వల్ల చక్కని ఆహ్లాదకర వాతావరణంతో పాటు పౌష్టికాహారంతో కూడిన ఆ పండ్లను తినడం వల్ల విద్యార్థుల్లో రోగనిరోధక శక్తిని కూడా పెంచవచ్చు.

దీనికి సంపూర్ణ పోషణ యోజన ప్రయోజనకరంగా ఉంటుందనేది అధికారుల ఆలోచన. ఈ నేపథ్యంలో కాకినాడలోని 90 పాఠశాలలకు గాను దాదాపు 63 పాఠశాలలు ఇందుకు అనువైనవిగా గుర్తించారు. ఆయా పాఠశాలల్లోని విశాల ప్రాంగణాల్లో కడియం నర్సరీతో పాటు అటవీ శాఖకు చెందిన నర్సరీల ద్వారా మొక్కలను రప్పించి నాటుతున్నారు. త్వరగా ఫలసాయం వచ్చేలా ఎదిగిన మొక్కలను రప్పిస్తున్నారు.

15 రకాలు పెంచేందుకు చర్యలు

ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో మొక్కలు పెంచే ప్రక్రియకు నగర ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి ఇటీవల శ్రీకారం చుట్టారు. మామిడి, అరటి, పెద్ద రేగి, సీతాఫలం, జామ, వాటర్ యాపిల్, నిమ్మ, నేరేడు, బాదం, ఉసిరి, పెద్ద ఉసిరి, సపోట, బొప్పాయి, కారంబోలా, పనస వంటి మొక్కలను ఇక్కడ పెంచనున్నారు. అతి త్వరగా వీటి ఫలసాయం అందేందుకు వీలుగా నిర్వహణపై దృష్టి పెట్టారు. రోటరీ వంటి స్వచ్ఛంద సంస్థలను సంప్రదించి మొక్కల నిర్వహణ బాధ్యతను అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రక్షణ లేని పరిస్థితులు ఉంటే అక్కడే ట్రీగార్డ్స్ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు.

పటిష్ట ప్రణాళికతో ముందుకు..



సంపూర్ణ పోషణ యోజనను పటిష్టవంతంగా అమలు చేసేందుకు ముందుకు వెళ్తున్నాం. దీనికి సుమారు 60 పాఠశాలలను ఎంపిక చేశాం. అక్కడ మొక్కలను నాటి వాటి నుంచి వచ్చే ఫలసాయాన్ని విద్యార్థులు మాత్రమే వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా వేసిన మొక్కలను పరిరక్షించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలతో కూడా సంప్రదిస్తున్నాం.

–సీహెచ్ నాగ నరసింహారావు, కమిషనర్, కాకినాడ

పండ్లతో పౌష్టికాహార లోపం నియంత్రణ



విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నియంత్రించి రోగనిరోధక శక్తిని పెంచే గుణం పండ్లలో ఉంటుంది. ఇమ్యూనిటీ లేక తరచూ జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలతో బాధపడడం, వీటి పర్యావసానంగా అనేక సమస్యలు ఉత్పన్నమవడం జరుగుతుంది. పండ్లలో ఉండే కార్బోహైడ్రేడ్స్, ఫ్లావనాయిడ్స్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ సి, ఆంథోసైనిన్స్ పిల్లలకు ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తోంది. పండ్లలో సూక్ష్మపోషకాలు సమృద్ధిగా ఉంటాయి.

– యనమదల మురళీకృష్ణ, వైద్యుడు

పాఠశాలల్లో ఆధునిక వసతుల కల్పన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: స్మార్ట్ సిటీ నిధులు రూ.32 కోట్లతో పాఠశాలల్లో ఆధునిక వసతులు కల్పిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. శుక్రవారం స్థానిక సాలిపేట, విముక్తి కాలనీ, శంతనపురి కాలనీ ప్రాంతాల్లో స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న వివిధ పాఠశాలల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పనుల ప్రగతిపై సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాడు– నేడు పథకంతో పాటు స్మార్ట్ సిటీ నిధులను కూడా ఖర్చు చేసి ఆర్వో ప్లాంట్లు, ఫర్నిచర్ సహా సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. నిర్మాణంలో ఉన్న పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. చేపట్టిన పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా దృష్టి సారించాలన్నారు. స్మార్ట్ సిటీ సిబ్బంది, అధికారులు, కాంట్రాక్టర్లు ఉన్నారు.

ముస్లింల సంక్షేమానికి సీఎం ప్రాధాన్యం

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- ఉర్దూఘర్‌కు శంకుస్థాపన



ఉర్దూఘర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో చర్యలు తీసుకుంటున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. స్థానిక జగన్నాథపురం జె.రామారావుపేటలో రూ.20 లక్షలతో ప్రతిపాదించిన ఉర్దూఘర్ నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీప్లస్ వన్ పద్ధతిలో ఉర్దూఘర్ నిర్మాణం జరుగుతుందన్నారు. అలాగే పర్లోపేట మసీదు ఆవరణలో రూ.30 లక్షలతో మదర్సా నిర్మాణానికి కూడా త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, నాలుగైదు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కేవలం ముస్లిం బాలికల కోసమే ఆ మదర్సా నిర్మిస్తున్నామన్నారు. కాకినాడలో అవసరమైన ప్రాంతాల్లో షాదీఖానాలు, మదర్సాలు, ఉర్దూఘర్ నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మైనార్టీ సెల్ ప్రాంతీయ సమన్వయ కర్త అబ్దుల్ బషీరుద్దీన్, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాషా, నాయకులు ఖాలిద్‌బిన్‌వలీ, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి కరీంబాషా, మక్కా మసీదు అధ్యక్షుడు ఎండీ ఖాజా మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన చంద్రయాన్-3



ఇస్రోకు సేవలందించిన అచ్యుతబాబు, గజ్జాటేలను సత్కరిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: ఇస్రో పంపిన ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై తన పాదాన్ని మోపి చరిత్ర సృష్టించిందని ఇస్రో మాజీ ఉద్యోగి పి.అచ్యుతబాబు అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో చంద్రయాన్-3 విజయోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల కిందట పంపిన చంద్రయాన్-2 విఫలమైనా, పట్టు వదలని విక్రమార్కుల్లా ఇస్రో చంద్రయాన్-3ని ప్రయోగించి చారిత్రాత్మక విజయాన్ని సాధించిందన్నారు. ల్యాండర్ నుంచి రోవర్ వేరుపడి తన అన్వేషణను ప్రారంభించిందన్నారు. జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయంతో అంతర్జాతీయ సాంకేతిక రంగంలో మన దేశం అగ్రగామిగా నిలిచిందన్నారు. గత 50 ఏళ్ల చరిత్రలో ఇదొక కీలకమైన మలుపు అన్నారు. దీనివల్ల మన దేశ ప్రతిష్ట మరింత ఇనుమడించిందన్నారు. డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ విజయం ఇస్రో స్ఫూర్తికి నిదర్శనమన్నారు. సరైన ప్రణాళికతోనే ఇస్రోకు గొప్ప విజయాలు చేకూరాయన్నారు. వారి నిబద్ధత, నిరంతర కృషి ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వంతో ఉప్పొంగేలా చేశాయని అడ్డాల తెలిపారు. అనంతరం ఇస్రో సంస్థకు సేవలు అందించిన పి.అచ్యుతబాబు, ఎంఎన్ గజ్జాటేలను ఘనంగా సత్కరించారు. అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు, రామారావు, అడబాల సత్యనారాయణ, వరప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



క్రియా యోగా దీక్ష కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సభ్యులు

కాకినాడ సిటీ/ కాకినాడ కల్చరల్: స్థానిక బాలాజీ చెరువు సెంటర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు సుషుమ్న క్రియా యోగా దీక్ష నిర్వహిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ ట్రస్టీ ఎస్.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం ఇక్కడి జయ రెసిడెన్సీలో ట్రస్టీ సభ్యులు ఎస్.శిరీషదేవి, డాక్టర్ జె.శృతికీర్తి, కె.పద్మలతో కలసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. దీనిని దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగా ఫౌండేషన్, అంతర్జాతీయ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ ప్రఖ్యాత గురువులు ఆత్మానందమయి అమ్మ హాజరై సంపూర్ణ ఆరోగ్య సాధనపై స్వయంగా అనుగ్రహిస్తారన్నారు. యోగా సాధనతో ఒత్తిడి తట్టుకునే శక్తి, మానసిక ప్రశాంతత, ఆరోగ్యకర జీవనం, ఉత్సాహం, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. నగర ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారూ హాజరు కావాలని కోరారు. అనంతరం క్రియా యోగా ధ్యానం పోస్టర్లు ఆవిష్కరించారు. జీఎస్ఎన్ మూర్తి, ఎ.రామచంద్ర, పి.సంజయ్, డి.రజనీకాంత్, ఎం.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ ప్రధాని కావడమే లక్ష్యం

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు



పళ్లంరాజు, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజులకు సత్కారం

కాకినాడ: రానున్న ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాని కావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు కోరారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులైన మల్లిపూడి మంగపతి పళ్లంరాజును పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి త్వరలోనే పూర్వ వైభవం రానుందన్నారు. కేంద్ర మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు మల్లిపూడి పళ్లంరాజు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిలుకూరి పాండురంగారావు, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, పీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, నాయకులు కామన ప్రభాకరరావు, దాట్ల గాంధీరాజు తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

- భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు
- వివిధ ఆలయాల్లో భక్తుల కిటకిట



మహాలక్ష్మి అలంకరణలో సంతచెరువు కనకదుర్గమ్మ వారు



కరపలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బోట్‌క్లబ్: సర్వపాపహరిణీ పాహిమాం అంటూ ఆ వరలక్ష్మీ దేవిని భక్తిప్రపత్తులతో కొలిచారు. శ్రావణ శుక్రవారం పూజలతో ప్రతి ఇంటా పండగ శోభ వచ్చింది. కాకినాడతో పాటు రూరల్, కరప మండలాల్లోని అమ్మవారి ఆలయాల్లో రద్దీ నెలకొంది. ఉదయం ఇంటి వద్ద వరలక్ష్మి పూజలు చేస్తుకున్న మహిళలు సాయంత్రం అమ్మవారి దర్శనానికి ఆలయాలకు రావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి వరకూ ఇదే పరిస్థితి ఉంది. అమ్మవారు బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉచిత దర్శనంతో పాటు రూ.10, రూ.20, రూ.30 క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. ఉచిత దర్శనం కోసం గంట వేచి ఉండాల్సి వచ్చింది. స్థానిక సంతచెరువు మార్కెట్‌లోని కనకదుర్గమ్మ వారు మహాలక్ష్మి అమ్మవారిగా దర్శనమిచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ ఆర్.రాజేశ్వరరావు పర్యవేక్షించారు. భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో ఉషారాజరాజేశ్వరి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు.

కరప మండలంలో..

కరప: మండలంలోని నడకుదురు, పెనగుదురు, కరప, పాతర్లగడ్డ, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, వేళంగి, కూరాడ, తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. పెనుగుదురులోని సంతోషిమాత ఆలయం, కరప విష్ణాలయం, యండమూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి అర్చకుడు కొంపెల్ల చక్రధరరావు పూజా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మేడిశెట్టి పెద్దకాపు, మేడిశెట్టి అప్పలస్వామి, నక్కా సత్యనారాయణమూర్తి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరప విష్ణాలయంలో అమ్మవారికి ఆలయ అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు పూజాదికాలు నిర్వహించారు. యండమూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లను అందంగా అలంకరించి, అర్చకులు పెద్దింటి సీతారామం పూజాదికాలు నిర్వహించారు. పెనుగుదురులోని సంతోషిమాత ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు కాదా సత్యనారాయణ ఆధ్వర్యంలో వ్రత పూజలు జరిగాయి.

రేపు విద్యార్థులకు పోటీలు

పెద్దాపురం: మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్ తెలిపారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సబ్ జూనియర్ విభాగం (నాల్గవ తరగతి వరకూ), జూనియర్ విభాగం (5, 6, 7 తరగతులు), సీనియర్ విభాగం (8, 9, 10 తరగతి) విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. ఆంగ్ల పదం లేకుండా తెలుగు భాషా ఔన్నత్యాన్ని తెలియజేస్తూ ఉపన్యాస పోటీలు, పద్యపఠనం, వివిధ తెలుగు కవులు, రచయితల వేషాధారణ పోటీలు ఉంటాయన్నారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ పోటీలు జరుగుతాయని ఆసక్తి గల విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో రొంగల అరుణ్, కూనిరెడ్డి రవికుమార్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

యువతను సన్మార్గంలో నడిపించాలి



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: యువతను సన్మార్గంలో నడిపించేందుకు సీవైఎఫ్ ఇంటర్నేషనల్ సంస్థ చేస్తోన్న కృషి స్ఫూర్తిదాయకమని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. త్వరలో జరగనున్న సీవైఎఫ్ యువజన మహోత్సవాల ప్రచార పోస్టర్‌ను ఎమ్మెల్యే శుక్రవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా సీవైఎఫ్ ఇంటర్నేషనల్ ఎంతో గుర్తింపు సాధించిందన్నారు. హ్యాపీనెస్–2023 పేరుతో అక్టోబర్ 1, 2 తేదీల్లో జరిగే యువజన మహోత్సవాలు విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తిరాజు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరాలు, కుట్టుమెషీన్ల పంపిణీ, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు దడాల జాషువా గిరి, సీవైఎఫ్ జాతీయ సమన్వయకర్త మోజేష్ కిరణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి జాన్‌విల్లిఫ్, రాష్ట్ర కోఆర్డినేటర్ జంగా గగారిన్, ఎస్పీ కార్యాలయ సూపరింటెండెంట్ అనిల్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వనదుర్గ అమ్మవారి జాతర



చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వన దుర్గ అమ్మవారి శ్రావణమాస జాతర మహోత్సవాలను శ్రావణ శుద్ధ దశమి శనివారం నుంచి ఈ నెల 31 వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. తొలి రోజు అమ్మవారిని 'బాలాత్రిపురసుందరీ దేవి'గా అలంకరించి పండితులు ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ విధంగా ఈ నెల 31 పౌర్ణిమ వరకూ రోజుకో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు వనదుర్గ అమ్మవారి ఆలయంలో పండితులు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం నిర్వహించి జాతర మహోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. నవధాన్యాలతో మండపారాధన, కలశస్థాపన చేస్తారు. 50 మంది రుత్విక్కులు పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం

రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. వేద పండితులు ముష్టి పురుషోత్తం, చిట్టిం వాసు, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.